# విపశ్యన మాసపత్రిక

VOLUME : 6 NO. - 6 1 SEPT, 2011

*(సాధకుల ప్రేరణ కొరకు ఉద్దేశించబడిన తెలుగుమాస పత్రిక)*

విపశ్యన అంతర్జాతీయ ధ్యాన కేంద్రం, ధమ్మఖేత్, వనస్థలిపురం, హైదరాబాదు - 70.

## "ధర్మవాణి"

**నిట్ఠఙ్గతో అసన్తాసీ, వీతతణ్హో అనఙ్గణో ।**

**అచ్ఛిన్ది భవసల్లాని, అనితయోయం సముససయో ॥**

**- ధమ్మపద - 351 తన్హావగ్గో**

**ఎవడు లక్ష్యాన్ని (అర్హంతస్థితిని) ప్రాప్తింప జేసుకున్నాడో, ఎవడు నిర్భయుడై, తృష్ణారహితుడై, నిర్మలుడై పోయాడో, ఎవడు భవ (భవాన్ని కొనితెచ్చే) శూల్యాలను తుంచి వేశాడో వానికి ఇదే అంతిమ జీవితం (అవుతుంది).**

**బుద్ధచారిక-4**

## సుజాతచేతి పరమాన్నం

ఉరువేల అరణ్యప్రదేశంలో 'సేన' అనే గ్రామంలో 'సేనాని' అనే ధనికుడుండే వాడు. అతని కూతురు సుజాతకు అక్కడున్న ఒక విశాల వటవృక్షదేవత మీద చాలా నమ్మకముండేది. వారణాసికి చెందిన ఒక శ్రేష్ఠితో తన వివాహం జరగడం ఆ దేవతయొక్క చలవేనని ఆమె గట్టిగా విశ్వసించేది. ఇరవైఏళ్ల క్రితం తనకు యశుడు అనే కుమారుడు కలగడం కూడా ఆ వృక్షదేవత కృపవల్లనేనని ఆమె నమ్మేది. అందుకు కృతజ్ఞతగా ఆమె ప్రతి వైశాఖ పౌర్ణమి రోజు అత్తవారింటి నుండి పుట్టింటికి వచ్చి, వటవృక్షాన్ని పూజించి నైవేద్యం సమర్పిస్తూ ఉండేది. ఈసారి ఆమె ఇష్టదైవానికి అర్పించడానికి నైవేద్యంగా మంచి రుచికరమైన పరమాన్నం తయారు చేసింది. ముందుగా వటవృక్షపీఠాన్ని శుభ్రంచేసి రమ్మని తన పరిచారికను పంపింది. అచ్చటకు వెళ్ళిన ఆ పరిచారిక ఆ వటవృక్షం కింద ఒక తపస్వి ధ్యానముద్రలో కూర్చుని ఉండడం చూసింది. ఆ తపస్వియొక్క తేజోవంతమైన ముఖమండలాన్ని, ఆకర్షణీయమైన మూర్తిత్వాన్ని చూసి ఆమె ఆశ్చర్యచకితురాలైంది. అమ్మగారి పరమాన్నం స్వీకరించడానికి ఈనాడు వృక్షదేవతే సశరీరంగా ప్రకటితమైందని భావించి, ఉరుకుపరుగున ఇల్లు చేరుకుని అమ్మగారికి విషయం తెలిపింది.

ఈ విషయం విని సుజాతకూడా సంభ్రమాశ్చర్యాలకు లోనయింది. ఒక బంగారుగిన్నెలో పరమాన్నం నింపుకొని, తన ఆరాధ్యదేవతకు నైవేద్యం సమర్పించడానికి శీఘ్రంగా వటవృక్షం వద్దకు చేరుకుంది. కాని సుజాత తెలివిగలది. భక్తిభావావేశంలో పడి భ్రాంతికి లోనయ్యే అమాయకురాలు కాదు. ఆ తపస్విని చూడడంతోనే ఆయన వృక్షదేవత కాదని గ్రహించింది. ఎవరో కులీనుడైన యువకుడు గృహత్యాగం చేసి, తపస్సు చేసుకుంటున్నాడని తెలుసుకుంది. తాను తెచ్చిన పరమాన్నం ఆ తపస్వికి అర్పించింది. ఆయన దాన్ని స్వీకరించడంతో అత్యంత ప్రసన్నురాలైంది.

ఈ వాస్తవం తెలియని కొందరు ఈ సంఘటనకు తమకుతోచిన కొన్ని కల్పితకథల్ని జోడించారు. పరమాన్నం అర్పించిన సమయంలో సుజాత పెండ్లికాని యువతి అని, తనకు ధనసంపన్నమైన మంచి కుటుంబం నుండి యోగ్యుడైన భర్త లభించాలని, తమకు ఒక పుత్రుడు కలగాలని ఆమె బోధిసత్వుని కోరుకున్నదనేది అందులో ఒకటి. కాని వాస్తవమేమంటే, ఆమె అప్పటికే మధ్యవయస్కురాలై ఉంది. ఆమెకు ధనవంతుడైన భర్తా, యువకుడైన పుత్రుడూ ఉన్నారు. ఆ పుత్రునికి వివాహం కూడా జరిగింది. కాని అతడు గృహస్థ జీవితంపట్ల ఇష్టం చూపేవాడు కాదు. వృక్షదేవత కృపవల్ల తన మునుపటి కోరికలు తీరినట్టుగానే, ఈ కోరిక కూడా తీరుతుందని సుజాత నమ్మకం. జీవితంలో తనకు జరిగిన మేలుపట్ల కృతజ్ఞతాభావంతో ప్రతి సంవత్సరం ఇదేనెలలో ఆమె పుట్టింటికి వచ్చి, వృక్షదేవతకు మొక్కి, నైవేద్యం పెట్టేది. ఈసారి కూడా ఆమె తన పుత్రుని సంసారజీవితం సాఫీగా నడవాలని, అందరు యువకుల్లా తన పుత్రుడు కూడా సంసారజీవితంపట్ల అనురక్తుడై ఉండాలని ప్రార్థించడానికి వచ్చింది. కాని ఆ యువతపస్విని చూసి ఆమెలో మాతృభావం కలిగింది. ఆయనను ఏదైనా అడగడానికి బదులు ఉప్పొంగిన వాత్సల్యంతో ఆప్యాయంగా పరమాన్నం అర్పించి "నీ తపస్సు ఫలించాలి" అని ఆశీర్వదించింది. సుజాత అర్పించిన పరమాన్నమే బోధిసత్వునికి చివరి భోజనం. ఆ రాత్రే ఆయనకు సమ్యక్‌సంబోధి ప్రాప్తించనుంది. అందుచేతనే ఈ భోజనదానం ఎంతో మహత్వపూర్ణమైందిగా పరిగణించబడుతుంది.

### మారుని పరాజయం

సుజాత అర్పించిన పాయసం తిని, బోధిసత్వుడు నిరంజరానది సమీపంలోని సాలవృక్షాలనీడలో కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్నాడు. సందెవేళకు ముందే పిప్పలవృక్షం (రావిచెట్టు) వద్దకు తిరిగి వచ్చి, ధ్యానం చేయడానికి కూర్చున్నాడు.

బాల్యంలో తాను తొలిదుక్కిపండుగ రోజున చేసిన "ఆనాపానా సతి" (శ్వాస రాకపోకలను గమనిస్తూ, వాటి ఎరుక కలిగి ఉండే) సాధన చేయసాగాడు. సహజమైన, స్వాభావికమైన శ్వాస రాకపోకలను గమనిస్తూ, ఆపై శరీరంలో కలిగే సంవేదనలనూ, వాటి ఉదయ–వ్యయ స్వభావాన్నీ భావనామయ ప్రజ్ఞతో సతతం అప్రమత్తంగా ఉండే అభ్యాసం చేయసాగాడు. ధ్యానం మొదలుపెట్టేముందు బోధిసత్త్వుడు దృఢసంకల్పం చేసుకున్నాడు – "ఎప్పటివరకు నాకు సమ్యక్‌సంబోధి లభించదో, అప్పటివరకు నేను ఇలాగే ఇదే ఆసనంలో కదలకుండా కూర్చుని ఉంటాను. నా శరీరంలోని మాంసం, మజ్జ, రక్తం పూర్తిగా ఎండిపోయినా నేను చలించను! ఎముకలు పొడిపొడి అయినా నేను చలించను! నేనేమాత్రం కలత చెందను!"

బోధిసత్త్వుని సంకల్పం మృత్యురాజు మారున్ని కలవరపాటుకు గురిచేసింది. పాపి మారుడు ఆందోళనతో ఉక్కిరిబిక్కిరి అయ్యాడు. "ఈ వ్యక్తి మృత్యుక్షేత్రాన్ని అనగా భవసంసరణక్షేత్రాన్ని దాటే ప్రయత్నం చేస్తున్నాడు. ఇతడు గనుక తన ప్రయత్నంలో సఫలుడైతే ఈ జన్మ ఇతని అంతిమజన్మ అవుతుంది **(– అయం మే అన్తిమా జాతి)**. అలాగే ఈసారి కలిగే మృత్యువు ఇతని అంతిమమృత్యువౌతుంది. ఇతనికి పునర్జన్మ ఉండదు **(– నత్థి దాని పునబ్భవోతి)**. ఇతడు నా భవసంసరణ సామ్రాజ్యక్షేత్రం నుండి బయటపడిపోతాడు. అది నాకు ఘోరమైన పరాజయమౌతుంది! అది నేను భరించలేను! ఎలాగైనాసరే! ఇతనిని ఈ ప్రయత్నం నుండి విరమింపజేయాలి! తీవ్రమైన భయాందోళనకు గురిచేసి, గట్టి ఆటంకాలు కల్పిస్తేనే ఈ వ్యక్తి విచలితుడైపోయి తన తపస్సును విరమిస్తాడు. అప్పుడే నాకు మనశ్శాంతి లభిస్తుంది! నేను విజయుణ్ణవుతాను! ఇతడు పరాజయుడౌతాడు!"

ఇలా ఆలోచించి మారుడు తన సిద్ధిబలంతో సహస్రబాహువులు గల భయంకరమైన మాయారూపం ధరించాడు. వేయిచేతుల్లో వేయి రకాల అస్త్రాలు ధరించి గరిమేఖల అనే భీకరమైన ఏనుగుపై కూర్చుని, అతి పెద్దసంఖ్యలో సైన్యాన్ని వెంటబెట్టుకుని బోధిసత్త్వుని వద్దకు వచ్చాడు. బోధిసత్త్వుని భయభీతుణ్ణి చేయడానికి పలువిధాలుగా దాడి చేయసాగాడు. కాని మారుడు, అతని సైన్యం ఎంత ప్రయత్నించినా బోధిసత్త్వుడు ఇసుమంతైనా చలించలేదు. మొక్కవోనిదీక్షత సాధన చేస్తూనే ఉన్నాడు.

దీంతో మారుడు అత్యంత అసహనానికి గురై పట్టరాని కోపంతో "నీవు కూర్చున్న వజ్రాసనం నాది! దానిమీద కూర్చునే అధికారం నీకేమాత్రం లేదు!" అని గర్జించాడు. దృఢనిశ్చయంతో కూర్చున్న తపస్వి బోధిసత్త్వుడు ఏమాత్రం చలించకుండా – "అన్ని పుణ్యపారమితలు పరిపూర్ణం చేసుకున్నవాడికే ఈ ఆసనంమీద హక్కుంటుంది! నేను అన్ని పరామితల్ని పూర్తిచేసినవాణ్ణి! కాబట్టి దీనిమీద నాకు పూర్తిహక్కుంది!" అని బదులు పలికి భూమివైపు చేత్తో సైగ చేస్తూ 'ఈ పృథ్వీమీద నేను అనేక జన్మల్లో పుణ్యపారమితల్ని పూర్తిచేశాను! అందుకు ఈ పృథ్వే సాక్షి!' అన్నాడు. ఆయన చేసిన ఈ సత్యఘోషణతో పృథ్వీమీద ఒక ప్రకంపనం కలిగింది. ఈ సత్యాన్ని ధృవీకరిస్తూ భూమి కంపించింది. దాంతో మారుడు హతాశుడైపోయాడు. బోధిసత్త్వుని భయభీతుణ్ణి చెయ్యాలని వచ్చిన మారుడు స్వయంగా తానే భయభీతుడై పోయాడు. తన సైన్యంతో వెంటనే అక్కడినుండి పారిపోయాడు.

మారుడు చేసిన అన్ని ప్రయత్నాలు విఫలమయ్యాయి. అసంఖ్యాక జన్మల్లో ప్రోగుచేసుకున్న పుణ్యపారమితలు కవచంగా నిలిచి బోధిసత్త్వుణ్ణి రక్షించాయి. మారుని ఏ మాయాప్రహారమూ ఆయనను తాకనైనా తాకలేకపోయింది. ఆయన వెంట్రుకనైనా కదల్చలేకపోయింది. బోధిసత్త్వుడు ఏమాత్రం చలించిపోలేదు. పూర్తిగా నిర్భయుడై ధ్యానంలో లీనమై ఉన్నాడు. సమత నిండిన ప్రజ్ఞతో ధ్యానంలో ప్రతిష్ఠితుడై ఉన్నాడు. అపరాజితుడైన బోధిసత్త్వుడు విజయుడయ్యాడు. పాపి మారుడు పరాజయుడయ్యాడు.

దానాది పుణ్యపారమితల బలంతోనే బోధిసత్త్వుడు విజయుడయ్యాడు. అందుకే అనబడింది –

**దానాది ధమ్మవిధినా జితవా మునిన్దో ––––**

**– (జయమఙ్గలఅట్ఠగాథా)**

పౌరాణిక వర్ణనల్ని ఒకపక్కనబెట్టి మనం మనోవైజ్ఞానిక స్థాయిలో యదార్థాన్ని అర్థం చేసుకుందాం. బోధిసత్త్వునిపై దాడిచేయడానికి సహస్రబాహువులు గల భీకరరూపం ధరించి మారుడు రాలేదు ; అతని సైన్యమూ రాలేదు. నిజానికి సాధకుడిలో గల మానసిక దుర్బలతలే పెల్లుబికి ఈవిధంగా దాడిచేస్తాయి. సాధన ముందుకు సాగకుండా అడ్డుపడతాయి. ఈ దుర్బలతల్నే పాపి మారుడు తన ఆయుధాలుగా మలుచుకొని, వాటిద్వారా సాధకుని తపోభ్రష్టుణ్ణి చేయడానికి ప్రయత్నిస్తుంటాడు. సాధకునిలో ఏక్షణంలో ఏ దుర్బలత పెల్లుబికితే, ఆ క్షణంలో దానికి ఊపందించడమే మారుని పని. పాపమయమైన మనోదుర్బలతలను, దుర్గుణాలను ధర్మమయమైన బోధియొక్క సబలతలతో, సద్గుణాలతో ఓడించగలుగుతాము. ఇక్కడా అదే జరిగింది.

ఆ వైశాఖపౌర్ణమినాటి సాయంత్రం బోధివృక్షం క్రింద కూర్చుని బోధిసత్త్వసిద్ధార్థగౌతముడు చేసిన యుద్ధం, వాస్తవానికి ధర్మం – అధర్మంతో చేసిన యుద్ధం, నిర్మలత్వం వికారాలతో చేసిన యుద్ధం, సద్గుణాలు దుర్గుణాలతో చేసిన యుద్ధం, అమరత్వం మృత్యువుతో చేసిన యుద్ధం. ఈ యుద్ధంలో ధర్మమే జయించింది. ఈ విజయంతోనే బోధిసత్త్వుడు సమ్యక్ సంబుద్ధుడయ్యాడు; సర్వజినుడయ్యాడు; సర్వజ్ఞుడయ్యాడు.

## సమ్యక్ సంబోధి

వైశాఖపౌర్ణమిరోజు సందె పొద్దువాలక ముందే పాపి మారుడు పరాజయం పొంది పారిపోయాడు. బోధివృక్ష పరిసర ప్రాంతమంతా ప్రశాంతంగా మారిపోయింది. మారునిసైన్యం సృష్టించిన ఉపద్రవాలతో అశాంతమయమైపోయిన వాతావరణం ఇప్పుడు అపరిమితమైన శాంతి తరంగాలతో నిండిపోయింది. పడమటిదిక్కున సూర్యుడు అస్తాద్రి ఒడిలోకి

వాలిపోతున్నాడు. తూర్పునుండి వైశాఖపూర్ణిమ చంద్రుడు మెల్లమెల్లగా పైకిలేస్తూ, అంతరిక్షమంతటా చల్లనివెన్నెల చిలకరిస్తూ ప్రకృతిని అత్యంత మనోహరంగా మార్చివేస్తున్నాడు. ఇప్పుడు బోధిసత్త్వుడు నిర్విఘ్నంగా ధ్యానంలో లీనమైపోయాడు.

రాత్రి మొదటిఝాములో ప్రథమధ్యానంలో సమాహితుడైన బోధిసత్త్వుడు, క్రమ-క్రమంగా రెండవ, మూడవధ్యానాలను దాటి నాల్గవ ధ్యానంలో ప్రతిష్ఠితమైపోయాడు.

రాత్రి మొదటిఝాములోనే ఆయనకు దివ్యచక్షు, దివ్యశ్రోత సిద్ధులు ప్రాప్తించాయి. వాటి ఆధారంగా పూర్వజన్మలస్మృతికి చెందిన అభిజ్ఞానం అనగా మహాజ్ఞానం ప్రాప్తించింది.

"ఏప్రాణి తన కర్మానుసారంగా ఎక్కడ జన్మిస్తుంది" అన్న అభిజ్ఞానం కూడా మేల్కొంది. దీనితోపాటు పరచిత్తజ్ఞానం కూడా మేల్కొన్నప్పుడు భవిష్యత్తును తెలుసుకునే అభిజ్ఞానం కూడా మేల్కొంది.

రాత్రి చివరిఝాములోకి ప్రవేశించేసరికి ఆయనకు ఆస్రవక్షయ అభిజ్ఞానం అనగా చిత్తమలినాల ప్రవాహం పూర్తిగా వినాశనమైందన్న అభిజ్ఞానం ప్రాప్తించింది. ఇలా అవగానే అన్ని లోకాలకు ఆవలగల వాస్తవికమైన నిత్యంయొక్క, శాశ్వతంయొక్క, ధృవంయొక్క పరిపూర్ణ సాక్షాత్కారమైంది. దాంతోపాటు సర్వజ్ఞతయొక్క మహాజ్ఞానం మేల్కొంది. సమ్యక్‌సంబోధి ప్రాప్తించింది. భవముక్తి సిద్ధించింది.

ఈవిధంగా వైశాఖపూర్ణిమరాత్రి పూర్తి అవుతూఅవుతూ ఉండగా ఆయన తపస్సు ఫలించింది. ఈ భద్రకల్పం యొక్క నాల్గవ సమ్యక్ సంబుద్ధుడు ప్రకటమయ్యాడు. అనేకుల కల్యాణానికి ముక్తి ద్వారాలు తెరుచుకున్నాయి.

## పునరావలోకనం

**గృహనిర్మాత –** బోధిసత్వసిద్ధార్థగౌతముడు సమ్యక్‌సంబుద్ధుడైన తరువాత తాను చేపట్టిన మధ్యమమార్గాన్ని, తద్వారా ప్రాప్తింపజేసుకున్న పరమముక్తిని పునరావలోకనం చేసుకుని చూశాడు. ఈ పునరావలోకనంలో ఈ సంసారంలో తాను మళ్ళీ-మళ్ళీ జన్మనెత్తుతూ, మరణిస్తూ ఈ జననమరణ చక్రాన్ని తయారు చేసేవాని వెతుకులాటలో ఎంతో సమయాన్ని వృధాగా పోగొట్టుకున్నానని తెలుసుకున్నాడు. ఎన్నోవేల సంవత్సరాలుగా ఒక నమ్మకం నడుస్తూవస్తోంది. ''ఈ జగత్తు సృష్టికంతటికీ మూలకారకుడైన ఈశ్వరుడొకడున్నాడు! ఆయనే ప్రాణుల జననమరణాలను నిర్దేశిస్తుంటాడు. ప్రాణులు మరణించినప్పుడు వాటి తర్వాతి జీవితానికి కావలసిన నూతన శరీరాన్ని ఆయనే తయారుచేస్తాడు. ఆ సృష్టికర్త అయిన ఈశ్వరుణ్ణి గనుక దర్శనం చేసుకుంటే మనం జననమరణ భవసంసరణ నుండి విముక్తి పొందగలుగుతాము'' అనే నమ్మకం ఈనాడుకూడా ఉంది. కాని బోధిసత్త్వునికి ఆ ఈశ్వరుని దర్శనమైతేకాలేదు, కాని ప్రాణులు కొత్తకొత్త జన్మలనెత్తుతూ భవచక్రంలో పడి నలిగిపోవడాన్ని చూసి సంతోషించే మారుని దర్శనం అయింది. అయితే ఈ మారునిదర్శనంవల్ల ఆయనకు ముక్తిమాత్రం లభించలేదు. మళ్ళీ-మళ్ళీ జన్మను కలిగించే ఉపకరణాల దర్శనంవల్లనే ఆయనకు ముక్తి లభించింది. ఆయనకు అవిద్యాంధకారంలో జన్మించే తృష్ణయొక్క దర్శనం అయింది. విద్యయొక్క ప్రకాశంలో అంధకారపూరితమైన అవిద్యాజన్యతృష్ణ మొలకెత్తజాలదనే సత్యంయొక్క దర్శనం అయింది, తద్వారా పాత సంస్కారాల వినాశనం యొక్క దర్శనం అయింది. ఈ దర్శనమే ఆయనకు ముక్తినిచ్చింది.

సమ్యక్‌సంబుద్ధుడు తెలుసుకున్నాడు – "నేను అవిద్యను సమూలంగా నాశనంచేసి, తృష్ణను కూకటివేర్లతోసహా పెల్లగించివేశాను. కొత్తసంస్కారాలు తయారుకావడం ఆగిపోగానే, నా చిత్తం పాత సంస్కారాల సంగ్రహంనుండి విముక్తమైంది. అవసరమైన నిర్మాణ సామాగ్రి కొరవడినందువల్ల ఇప్పుడు ఏ కొత్తగృహమూ తయారు కాజాలదు. ఈ గృహనిర్మాణ సామాగ్రి గురించిన సత్యంయొక్క దర్శనం వల్లనే నాకు భవముక్తి కలిగింది. **అయం అన్తిమా జాతి –** ఇది నా అంతిమ జన్మ, **నత్థి దాని పునబ్భవోతి –** ఇక నాకు పునర్జన్మ లేదన్నది స్పష్టం. నా భవసంసరణ తెగిపోయింది."

సమ్యక్ సంబోధి యొక్క నైర్వాణిక సుఖశాంతులు ప్రాప్తించిన తరువాత సంబుద్ధుడు సింహావలోకనం చేసుకుంటూ ఇదంతా ఎలా జరిగిందో చూశాడు.

ఈ పునరావలోకనంతో ఆయనకు రెండవ సత్యంకూడా తేటతెల్లమైంది. – "ఆదినుండి అంతంవరకు ఈ మొత్తం మార్గం పూర్తిగా యథాభూతసత్యం అనగా యథార్థం మీదనే ఆధారపడి ఉంది. ప్రతిచోట యథాభూతమే ఆలంబనగా ఉంది ; ఎక్కడా యథాకృతం గాని, యథాకల్పింగాని, యథావాంఛితంగాని, యథాఆరోపితంగాని లేనేలేదు. మొత్తంమార్గం సత్యమే సత్యమై ఉంది. సత్యంమీదనే ఆవలంబితమై ఉంది. సత్యమే పునాదిగా నిలిచి ఉంది. ధర్మం అందుకే సద్ధర్మం అనగా సత్యధర్మం అనబడింది."

బుద్ధుని తరువాతికాలంలో సత్యంయొక్క ఈ ఆలంబనే మన సంత్‌పురుషులవాణిలో నిండిపోయింది. మనదేశానికి చెందిన ఒక గొప్ప సంత్‌పురుషుడు గురునానక్ వాణిలో ఇది స్పష్టంగా కనిపిస్తుంది.

**ఆది సచు, జుగాది సచు, హై భీ సచు, నానక్ హోసీ భీ సచు ।**

– ఆదినుండి అంతంవరకు సత్యమే సత్యం.

సంత్‌పురుషుడైన వ్యక్తికి అసత్యపు ఆలంబన రుచించదు. అందుకే అంటాడు –

**కివ సచియారా హోఇఏ, కివ కూడై తుటై పాలి ।**

– అసత్యపు పరదాలన్నీ ఛిన్నాభిన్నమై పోవాలి, కేవలం యథాభూతసత్యం మీదనే ఆధారపడి సత్యగాములం కావాలి.

క్షణప్రతిక్షణం తనకుతానుగా ప్రకటితమైనదే యథాభూత సత్యం. యథాఆరోపితమైంది కాదు, యథాకల్పితమైంది కాదు. యథార్థంగా ఎప్పుడు ఎలాఉంటే అప్పుడు అలా ఉంది. అందుకే అన్నాడు –

**థాపిఅ న జాఇ, కీతా న హోఇ ।**
**ఆపే ఆపి నిరంజన సోఇ ॥**

– తనకు తానుగా ప్రకటితమైనదే సత్యం. దానిమీద మనవైపు నుండి ఏ దార్శనికమాన్యతనూ మోపడం జరుగరాదు. తనకుతానుగా ప్రకటితమైన నైసర్గికసత్యాన్ని అలక్ష్యం చేసి, దాని స్థానంలో ఏ కృత్రిమ సత్యాన్నీ ఆరోపితం చేయరాదు.

ఆ నైసర్గికసత్యానికి ఏ రూపమూ ఉండదు. అది చూడలేనిది. అందువల్లనే అది నిరంజనమనబడుతుంది. దాన్ని కేవలం అనుభవించ గలం. అంతే !

## సత్యనామం

భారతదేశపు ప్రాచీనభాషలో చిత్తాన్ని మరియు చిత్తవృత్తులను **'నామం'** అనేవారు. **(అభిధమ్మత్థసఙ్గహో, అభిధమ్మావతార – నామరూపపరిచ్ఛేదాది – 1205 దిట్ఠివిసుద్ధినిద్దేసో)** ఎవని చిత్తం మరియు చిత్తవృత్తులు ఎల్లప్పుడూ సత్యంతోనే నిండి ఉంటాయో అతడు **సత్యనాముడు** అనబడేవాడు. బుద్ధుని **నామం** అనగా చిత్తం మరియు చిత్తవృత్తులు ఎల్లప్పుడూ సత్యంతోనే నిండి ఉండేవి. కాబట్టే ఆయనను **సత్యనాముడు** అని కూడా పిలిచేవారు. తరువాతికాలంలో అనేకమంది ఋషిపుంగవులు, సంత్‌పురుషులు పరమాత్మణ్ణి సంబోధించుటకు **సత్యనామ్, సత్‌నామ్** పదాలను ఉపయోగించడం జరిగింది.

**భవతు సబ్బ మఙ్గలం**

సద్ధర్మ పథికుడు
**సత్యనారాయణ గోయంక**
(విపశ్యన హిందీ మాసపత్రిక 21 మార్చి, 2008 సంచికకు తెలుగు అనువాదం)

## విపశ్యన ధ్యానం – ఒక పరిచయం

విపశ్యన భారతదేశపు అతిపురాతనమైన ధ్యాన పద్ధతి. 2,500 సంవత్సరాల క్రితం కనుమరుగైన ఈ ధ్యాన పద్ధతిని గౌతమబుద్ధుడు తన స్వయంకృషితో వెతికి వెలికితీశాడు. విపశ్యన అంటే ఉన్నది ఉన్నట్లుగా చూడగలగటం. ఇది ఒక స్వయం పరిశీలనా ప్రక్రియ. సాధకులు మనస్సు యొక్క ఏకాగ్రతకోసం సహజ స్వాభావిక శ్వాసను చూడటంతో ప్రారంభించి, జాగృత మనస్సుతో శరీరము మనస్సుల పరివర్తనా స్వభావాన్ని పరిశీలిస్తూ అనిత్యము, దుఃఖము అహంకారరాహిత్యము అనే విశ్వజనీన సత్యాల అనుభూతిని పొందగలుగుతారు. ప్రత్యక్షానుభూతితో సత్యాన్ని దర్శించటం ద్వారా మనస్సును నిర్మలం చేసుకొనడం ఈ సాధనావిధి ప్రత్యేకత. ధర్మమార్గము ఆద్యంతము మానవాళి ఎదుర్కొనే సార్వజనీన వ్యాధులకు సార్వజనీన ఔషధం. దీనికి ఏ మతంతోగాని వర్గంతోగాని నిమిత్తంలేదు. జాతి, కుల, మత భేదాలు లేకుండా ఎవరైనా సాధనచేసి సమంగా ప్రయోజనం పొందవచ్చు.

నిర్వాణము, ముక్తి వంటి అత్యున్నత ఆధ్యాత్మిక లక్ష్యసాధన కోసమే విపశ్యన ధ్యానము ఉద్దేశించబడింది. కేవలం శారీరక వ్యాధులను నయం చేయటం దీని లక్ష్యం కాదు. అయితే మనస్సు నిర్మలం కావటం వల్ల ఇతర ఫలితాలతోపాటు శారీరక మానసిక బాధలు కూడ ఉపశమిస్తాయి. ఈ విద్య సమస్త దుఃఖాలకు కారణాలైన రాగ, ద్వేష, మోహాలను నిర్మూలం చేసే జీవనకళ. నిత్య జీవితంలో అనుభవించే అశాంతిని దూరంచేసి ఇష్టమైన లేదా అయిష్టమైన పరిస్థితుల పట్ల సంయమనం లేకుండా ప్రతిస్పందించే మన పాత అలవాటు ఫలితంగా ఏర్పడే బంధనాలను తొలగిస్తుంది. వ్యక్తి, సమాజాల ప్రగతికోసం సృజనాత్మకశక్తిని పెంపొందిస్తుంది.

అంతర్ముఖులై మనస్సును పరిశుద్ధం చేసుకునే ఈ ప్రక్రియ అంత సులభమేమీ కాదు. సాధకుడు బాగా కష్టపడి పనిచేయవలసి ఉంటుంది. ప్రతి సాధకుడు స్వయంగా కష్టపడి ఆశించిన ఫలితాలు సాధించాలి. తనకోసం ఇతరులు ఏమీ చేయలేరు. బాగా కష్టపడి క్రమశిక్షణతో పనిచేసేవారికే నిజమైన ప్రయోజనం చేకూరుతుంది. నియమ నిబంధనల ప్రకారమే ధ్యానసాధన చేయాలి.

**సంవత్సర చందా రూ.50/-, 5 సంవత్సరముల చందా రూ.200/- ఈ క్రింది చిరునామాకు పంపి పత్రికను పొందగలరు.**
**విపశ్యన తెలుగు మాసపత్రిక,**
**విపశ్యన అంతర్జాతీయ ధ్యాన కేంద్రం, నాగార్జున సాగర్ రోడ్, వనస్థలిపురం, హైదరాబాదు – 500 070. ఫోన్ : 24240290 (ఆశ్రమం)**
***(ఆఫీసు పనిచేయు వేళలు : ఉదయం 9 గం॥ల నుండి సాయంత్రం 5 గం॥ల వరకు)***

Postal Reg. HSE 864/2007-2009 RNI Reg. No. APTEL/2006/17745

**PRINTED MATTER**

If Undelivered please return to :
**VIPASSANA INTERNATIONAL MEDITATION CENTRE,**
12/6KM, Nagarjuna Sagar Road, Sahebnagar, Vanasthalipuram,
HYDERABAD - 500 070.
Website : www.vri.dhamma.org
E-mail : info@khetta.dhamma.org

**Published for Vipassana International Meditation Centre, 12/6 KM, Nagarjuna Sagar Raod, Sahebnagar, Vanasthalipuram, Hyd. (A.P.)-70. Ph : 040-24240290. Published by Smt. Sabrina Katakam.**
**Editor : Sri O. Premanand, Printed at Sai Likhita Printers, #6-2-959, Dakshin Bharat Hindi Prachar Sabha Complex, Khairatabad, Hyd. Ph : 23325979.**